క్లుప్తంగా

కళ్లను కాపాడుకోండి



మోదుగులకుంటలో వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిక్ అధికారి సికిందర్

తాడిమర్రి: సున్నితమైన కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఆప్తాలమిక్ అధికారి సికిందర్ వృద్ధులకు సూచించారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని మోదుగుకుంట గ్రామంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన 40 మందికి కంటి పరీక్షలు చేయగా.. 10 మందికి క్యాటరాక్ట్ శస్త్ర చికిత్సలు, 15 మందికి కంటి అద్దాలు అవసరం ఉన్నట్లు గుర్తించారు. శస్త్ర చికిత్సలు అవసరం ఉన్న వారిని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. వారం, పది రోజుల్లో కంటి అద్దాలు తెప్పించి ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ ముంబిన్‌తాజ్, ఏఎన్ఎం రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

కుళాయిల ఏర్పాటు

నల్లచెరువు: మండల పరిధిలోని పత్రవాండ్లపల్లి గ్రామంలో గురువారం సర్పంచ్ పంచరత్నమ్మ, డీఈ కిరణ్ సాయి ఆధ్వర్యంలో జేజేఎం పథకం ద్వారా రూ.2 లక్షల వ్యయంతో 22 నీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ, నాయకులు రామాంజనేయులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, జేఈ మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయానికి రూ.50 వేల విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గాండ్లపెంట: మండల పరిధిలోని తూపల్లి పంచాయతీ మునగలవారిపల్లిలో నూతనంగా నిర్మించిన చెన్నకేశవస్వామి ఆలయానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి గురువారం రూ.50 వేల విరాళం అందించారు. ఆ మొత్తాన్ని పార్టీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, ఎంపీపీ తాతం జగన్మోహన్ తదితరులు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ నిర్మాణానికి సహకారం అందించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, బీసీ కన్వీనర్ నరసింహా గౌడ్, గొడ్డువెలగల సర్పంచ్ ఆంజనేయులు, మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు వాటర్ ట్యాంకుల వితరణ

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పలు దేవాలయాలకు వాటర్ ట్యాంకులు అందించామని యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకే శ్రీనివాసులు తెలిపారు. వైఎస్సార్ కాలనీలోని మంజునాథస్వామి దేవాలయం, గొట్లూరులోని శివరామ దీక్షితులు ఆశ్రమానికి రెండు వాటర్ ట్యాంకులను వంకదారి రామచంద్రగుప్తా సహకారంతో అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ కార్యదర్శి సుకుమార్, కోశాధికారి రాధాకృష్ణ, సభ్యులు బీఆర్ రంగనాథ్, బండి నాగేంద్ర, రమేష్‌బాబు, జయంతి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు సర్వే



ఓటరు నమోదుపై ఆరా తీస్తున్న మండల ప్రత్యేకాధికారి వంశీకృష్ణారెడ్డి

బత్తలపల్లి: ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని మండల స్పెషల్ ఆఫీసర్ (డీఎస్‌ఓ) వంశీకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీఎల్‌ఓలు నిర్వహించిన సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓట్ల తొలగింపు, డబుల్ ఓట్లు, ఓటరు కార్డుల్లో మార్పులు, చేర్పులు, తొలగింపు తదితర వాటిపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఎల్‌ఓలు బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. 2022 జనవరి నుంచి ఇప్పటి వరకు తొలగించిన ఓటర్ల జాబితాను పరిశీలించడం జరిగిందన్నారు. బీఎల్‌ఓలు మరోసారి ఇంటింటికీ వెళ్లి ఓటర్ల పరిశీలన చేయాలని ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా పకడ్బందీగా కసరత్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏ స్థాయిలో అభ్యంతరాలు ఉన్నా తిరిగి విచారణ చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ యుగేశ్వరిదేవి, వీఆర్‌ఓ ప్రతాప్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు కాపాడుకుందాం



కదిరి: సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు (ఇన్‌సెట్‌లో) ప్రసంగిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా

కదిరి: ప్రజల కోసం ఉపయోగపడుతున్న ప్రభుత్వ స్థలాలను కాపాడుకోవడానికి అందరం కలిసికట్టుగా పోరాడదామని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు సూచించారు. ఇందుకు కౌన్సిల్ మొత్తం ఆమోదముద్ర వేసింది. గురువారం చైర్‌పర్సన్ పరికి నజీమున్నిసా అధ్యక్షతన జరిగిన కదిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాడీవేడిగా సాగింది. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానాన్ని కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాంటి వారికి మున్సిపల్ అధికారులు ఎలా సహకరిస్తారని కౌన్సిలర్లు రంగారెడ్డి, కృపాకరరెడ్డి, ఇస్మాయిల్, మహమ్మద్, ఇంకా పలువురు కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. కబ్జా చేసిన ప్రభుత్వ స్థలానికి సదరు కబ్జాదారులతో ఖాళీ జాగా పన్ను వసూలు చేసి మరిన్ని హక్కులు కల్పించడమేంటని ప్రశ్నించారు. తక్షణం అందుకు సంబంధించిన క్రయ విక్రయాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని కమిషనర్ శ్రీహరిబాబు సమాధానమిచ్చారు. కదిరి–హిందూపురం రహదారిలో మూర్తిపల్లికి వెళ్లే దారిలో ఉన్న ఆర్యవైశ్య శ్మశాన వాటికలో కట్టెలతో శవాలను కాల్చేందుకు స్థానికులు కొందరు అడ్డు చెబుతున్నారు. అది ఎంత వరకు కరెక్ట్? అని కౌన్సిలర్ ఎంఎస్ ఫయాజ్ ప్రశ్నించారు. పలు కారణాలు చెబుతూ ఆ శ్మశాన వాటికలో శవాలను దహనం చేయకుండా కొందరు హైకోర్టును సైతం తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. దీనిపై కౌన్సిల్ మూకుమ్మడిగా తీర్మానం చేస్తూ మృతదేహాల దహనానికి సహకరించాలని కోరారు. అనంతరం కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

ప్రభుత్వ ధనం వృథా చేయొద్దు..

మున్సిపాలిటీలోని తాగునీటికి సంబంధించి ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న సిబ్బందికే పూర్తి స్థాయిలో పని లేదు. ఆ విభాగంలో మరో ఇద్దరిని తీసుకోవాలని అధికారులు కోరడంపై కౌన్సిలర్ కిన్నెర కళ్యాణ్ అభ్యంతరం తెలిపారు. ప్రభుత్వ ధనం వృథా చేయడం తప్పా మరొకటి లేదన్నారు. పలు సమస్యలపై తాను ప్రతి కౌన్సిల్‌లో ప్రస్తావిస్తున్నా పరిష్కరించిన పాపాన పోలేదని 10వ వార్డు కౌన్సిలర్ దిల్షాదున్నిసా ఆవేదన వ్యక్తం చేశారు. అనధికారిక లే అవుట్లలోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయద్దని సబ్ రిజిస్ట్రార్‌కు రాతపూర్వకంగా తెలియజేశామని కమిషనర్ సమాధానమిచ్చారు. సమావేశంలో వైస్ చైర్మెన్లు కొమ్ము గంగాదేవి, అజ్జుకుంటు రాజశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతి పల్లెకు రహదారి సౌకర్యం



తారు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ముదిగుబ్బ: నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు సైతం రహదారి సౌకర్యం కల్పించడం జరుగుతోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని యంగన్నగారిపల్లిలో రూ.83 లక్షలతో నిర్మించిన తారురోడ్డును గురువారం నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రహదారులు లేని గ్రామాలు అంటూ ఉండకూడదన్నారు. ఇందుకోసం ప్రతి గ్రామానికి తారు రోడ్డు నిర్మించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు బయపరెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరెడ్డి, ఎంపీటీసీ మస్తాన్‌రెడ్డి, నాయకులు మాదవరెడ్డి, క్రిష్ణయ్య, కిరణ్‌మోహన్ రెడ్డి, లక్ష్మీరెడ్డి, నాగభూషణ, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



రన్నర్స్ ట్రోఫీ అందుకున్న జిల్లా జట్టు

హిందూపురం టౌన్: విజయవాడలో ఈనెల 29, 30 తేదీల్లో జరిగిన సబ్ జూనియర్స్ రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో సత్యసాయి జిల్లా జట్టు రన్నర్స్‌గా నిలిచి రెండవ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఫైనల్‌లో అనంతపురం, సత్యసాయి జిల్లా జట్టు తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో 1-0 తేడాతో అనంతపురం జట్టు విజేతగా నిలిచింది. సత్యసాయి జట్టు రన్నరప్‌గా నిలిచింది. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు, కార్యదర్శి మహమ్మద్ సలీమ్, కోచ్ చైతన్యను గురువారం ఫుట్‌బాల్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్ అభినందించారు.

అధికారుల ఆదేశాల మేరకే జంక్షన్ ఏర్పాటు



జాతీయ రహదారుల అధికారులు, రైతులతో చర్చిస్తున్న తహసీల్దార్ యుగేశ్వరిదేవి

బత్తలపల్లి: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జాతీయ రహదారిపై జంక్షన్ ఏర్పాటు చేస్తామని, తామంతటతాముగా ఏర్పాటు చేయలేమని తహసీల్దార్ యుగేశ్వరిదేవికి నేషనల్ హైవే డీఈ రామచంద్రారెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పొలాలకు వెళ్లేందుకు దారి వదలాలంటూ ఇటీవల రైతులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన విషయం తెలసిందే. గురువారం జాతీయ రహదారుల అధికారులతో కలిసి రస్తా వదిలే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు తమకు రస్తా వదలకపోతే ఇరువైపులా కిలోమీటర్లు దూరం వెళ్లాల్సి వస్తుందన్నారు. రస్తా వదిలితే అక్కడ పాయింట్ లేకున్నా ఎందుకు వదిలారంటూ తమపై చర్యలు ఉంటాయని అధికారులు విన్నవించారు. దీంతో ఇరువర్గాల వాదనలు విన్న తహసీల్దార్ వేర్వేరుగా అర్జీలు ఇవ్వాలని సూచించారు. ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. పట్టాదారు పాసుపుస్తకాలతో కలిసి అర్జీలు అందజేస్తామని రైతులు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో రైతులు జక్కంపూటి సత్యనారాయణ, కొంకా గాంధీలతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

నేత్రదానంతో మరొకరికి చూపు



కరపత్రాలు విడుదల చేస్తున్న రెడ్‌క్రాస్, స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు

ధర్మవరం అర్బన్: మరణానంతరం కళ్లు దానం చేయించి చూపులేని ఇద్దరికి చూపు ప్రసాదించాలని శ్రీసత్యసాయి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పోలా ప్రభాకర్, ధర్మవరం టౌన్ చైర్మన్ డాక్టర్ నరసింహులు తెలిపారు. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో గురువారం జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం స్వచ్ఛంద సేవా సంస్థలకు నేత్రదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మరణానంతరం ప్రతి ఒక్కరూ కళ్లు దానం చేసేలా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. స్వచ్ఛంధ సేవా సంస్థలు యువతీ, యువకులు, విద్యార్థులకు నేత్రదానంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గూడూరు మోహన్‌దాస్, కార్యదర్శి రాజగోపాల్, కోశాధికారి వేణుగోపాలాచార్యులు, రోటరీక్లబ్ అధ్యక్షుడు జయసింహ, కార్యదర్శి నాగభూషణం, ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, రత్నశేఖర్‌రెడ్డి, శివయ్య, యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకే శ్రీనివాసులు, కార్యదర్శి సుంకుసుకుమార్, కోశాధికారి రాధాకృష్ణ, విశ్వదీప సేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కోళ్లమొరం చంద్రశేఖర్‌రెడ్డి, ఆదర్శ సేవా సంఘం సభ్యుడు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు కృషి చేయాలి



ధర్మవరం: సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి

ధర్మవరం: పట్టణాభివృద్ధితో పాటు పరిశుభ్రతకు అందరి సహకారం అవసరమని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో గురువారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పట్టణంలో పందుల బెడద ఉంది. వీధిదీపాలు సరిగ్గా వెలగడం లేదు. ఫాగింగ్ చేయకపోవడంతో దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, మేడాపురం వెంకటేష్, బ్రహ్మయ్యాచారి, గోరకాటి పురుషోత్తంరెడ్డి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి తదితరులు సభ దృష్టికి తీసుకొచ్చారు. డివైడర్ల మధ్యలో ఉన్న చెట్లకు తూతూమంత్రంగా నీరు పోస్తుండటంతో చెట్లు ఎండిపోతున్నాయని కౌన్సిలర్లు తెలిపారు. పట్టణంలో ఎక్కడైనా పాత భవనాలు కూల్చి వేస్తే ఆ మట్టిని బండ గుంతలో వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ బండి శేషన్నను మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ చైర్మెన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం, ఈఈ సత్యనారాయణ, డీఈ వన్నూరప్ప, ఏఈలు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి సాధ్యం



ధర్మవరం రూరల్: ప్రగతి నివేదికలను వినిపిస్తున్న అధికారులు

ధర్మవరం రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండలాన్ని అభివృద్ధి చేద్దామని ఎంపీపీ గిరక రమాదేవి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీఓ సౌజన్య కుమారి మాట్లాడుతూ.. ఆయా శాఖల వారిగా ప్రగతి నివేదికలను చదివి వినిపించాలని అధికారులకు సూచించారు. వ్యవసాయాధికారి ముస్తఫా మాట్లాడుతూ.. వర్షాభావం కారణంగా చాలా మంది రైతులు వేరుశనగ సాగు చేసుకోలేకపోయారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులకు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసుకునేందుకు ఉలవ, అలసంద, పెసర విత్తనాలను సబ్సిడీపై ఇవ్వడానికి చర్యలు చేపట్టిందన్నారు. కావాల్సిన రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే వారికి విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రైతులు తాము సాగు చేసిన పంటలను ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. ఈ క్రాప్ చేయించుకుంటేనే ప్రభుత్వం నుంచి అన్ని రాయితీలు అందుతాయన్నారు. ఏపీఎం రఘునాథరెడ్డి మాట్లాడుతూ.. మహిళా సంఘం సభ్యులకు చిన్నపాటి వ్యాపారాలు చేసుకోవడానికి సబ్సిడీ రుణాలను ప్రభుత్వం పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. ఎలాంటి వ్యాపారులు చేయాలనుకున్నారో దరఖాస్తు చేసుకుంటే వాటికి అనుగుణంగా రుణాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కిట్లను సక్రమంగా అందించాలి



టీహెచ్‌ఆర్ కిట్స్ పంపిణీపై సమీక్షిస్తున్న డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి

బత్తలపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు అందిస్తున్న టీహెచ్‌ఆర్ (టేక్ హోమ్ రేషన్) కిట్లను సక్రమంగా అందించాలని డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి ఆదేశించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ యుగేశ్వరి దేవి, సీఎస్‌డీటీ శారదతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో అంగన్‌వాడీల్లో గర్భిణులు, బాలింతలకు మధ్యాహ్న భోజనం అందజేయడం జరిగేదన్నారు. దీనికి దూరంగా ఉన్న బాలింతలు, గర్భవతులు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి భోజనం చేయటానికి ఇబ్బందిపడుతున్నారన్నారు. టేక్ హోం రేషన్ కింద ఇంటికే అందించడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఉన్న గర్భవతులకు, బాలింతలకు యాప్ కింద నమోదు చేసి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందులో 3 కేజీలు బియ్యం, 1 కేజీ కందిపప్పు, అర లీటరు ఆయిల్, కోడిగుడ్లు 25, పాలు 5 లీటర్లు, అటుకులు 1 కేజీ, రాగిపిండి 2 కేజీలు, బెల్లం 250 గ్రాములు, ఎండు ఖర్జూరం 250 గ్రాములు, వేరుశనగ చిక్కీలు 250 గ్రాములు అన్ని కలిపి బ్యాగ్‌లో అందజేస్తున్నట్లు వివరించారు. ప్రతి నెలా 1వ తేదీన టీహెచ్‌ఆర్ కిట్ల పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ఇప్పటి నుంచి ప్రతి నెలా లోనూ మొదటి శుక్రవారం రోజు అంగన్‌వాడీ కేంద్రాల్లో టీహెచ్‌ఆర్ కిట్స్ డిస్ట్రిబ్యూషన్ డేగా జరుపుకోవాలన్నారు. అనంతరం మండలంలో రేషన్ కార్డుదారులకు అందుతున్న నిత్యావసర సరుకులు, తదితర అంశాలపై సమీక్షించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న ఏపీఎం హేమలత

కనగానపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో ఉండే నిరుద్యోగ యువతి, యువకులకు వృత్తి నైపుణ్యాలపై ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు ఏపీఎం హేమలత తెలిపారు. గురువారం స్థానిక వైకేపీ కార్యాలయంలో డ్వాక్రా సంఘాల లీడర్లు, యానిమేటర్లతో సమావేశం నిర్వహించారు. ఉపాధి పథకంలో వంద రోజులు పనిదినాలు పూర్తి చేసిన కుటుంబాల్లో ఇంటర్ నుంచి డిగ్రీ వరకు చదువుకున్న నిరుద్యోగులను గుర్తిసామన్నారు. వీరికి కంప్యూటర్, కమ్యూనికేషన్స్ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారన్నారు. 3వ తేదీలోపు వీరబ్రహ్మేంద్ర మండల సమాఖ్య కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని మండల కోఆర్డినేటర్ అనంతలక్ష్మి తెలిపారు. పూర్తి వివరాలకు సెల్: 7702100238, 9182316114లో సంప్రదించాలన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన

పుట్టపర్తి: బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లికి చెందిన తనపై ఇదే గ్రామానికి చెందిన కాటమయ్య, జయరామ్ తదితరులు దాడి చేశారని దళితుడు నాగేంద్ర బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. నిందితులను గురువారం బుక్కపట్నం స్టేషన్‌కు పోలీసులు తీసుకొచ్చారు. నిందితులను పోలీసులు కొట్టారనే పుకార్లు రావడంతో వారి బంధువులు స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ కేసులో ఎలాంటి రాజకీయాలు లేవని ఏ ఒక్కరిపై పోలీసులు చేయి చేసుకోలేదని కొత్తచెరువు సీఐ రామయ్య వెల్లడించారు. రాత్రి 10:30 గంటలకు నిందితులను స్టేషన్ బెయిల్‌పై ఇంటికి పంపించారు.

వైఎస్సార్ విగ్రహావిష్కరణకు తరలిరండి



విగ్రహ ప్రతిష్టకు స్థలాన్ని పరిశీలిస్తున్న బత్తల వెంకటరమణ

తనకల్లు: మండల కేంద్రంలోని నూతన సచివాలయం వద్ద ఈనెల 2వ తేదీన డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తల వెంకటరమణ తెలిపారు. గురువారం సచివాలయం వద్ద ఏర్పాటు విగ్రహం ఏర్పాటు చేయనున్న స్థలాన్ని పరిశీలించారు. అతిథులుగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పాల్గొంటారన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కడపల మోహన్‌రెడ్డి చేతుల మీదుగా విగ్రహావిష్కరణ ఉంటుందన్నారు. సీఈసీ సభ్యులు జక్కల ఆదిశేషు, పూల శ్రీనివాసులరెడ్డి, యువనాయకుడు వాల్మీకి పవన్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు సంపంగి గోవర్దన్, నరేంద్ర, జయరాజ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ వేదిక

గాండ్లపెంట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు 16వ విడత ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ బహిరంగ వేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రామానాయక్ గురువారం తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపీపీ, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, ఉపాధిహామీ సిబ్బంది, ఉపాధి కూలీలు హాజరుకావాలని సూచించారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

బత్తలపల్లి: ప్రతి నెలా వృద్ధులు, దివ్యాంగులు, వితంతు, ఒంటరి మహిళలకు అందజేస్తున్న సామాజిక పింఛన్ల సొమ్మును శుక్రవారం నుంచి పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ సౌజన్యకుమారి తెలిపారు. మండల వ్యాప్తంగా 6,323 మందికి వివిధ రకాల పింఛన్ల కోసం రూ.1,74,90,500 విడుదలైనట్లు వెల్లడించారు. అలాగే మండలానికి కొత్తగా 166 పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. అప్రాచెరువు 10, బత్తలపల్లి–1లో 17, బత్తలపల్లి–2లో 15, బత్తలపల్లి–3లో 22, డి.చెర్లోపల్లిలో 14, దంపెట్లలో 17, ఈదుల ముష్టూరులో 11, మాల్యవంతంలో 15, ఓబుళాపురంలో 13, సంజీవపురంలో 24, తంబాపురంలో 8 మందికి కొత్తగా పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. ఇంకా దరఖాస్తు చేసుకున్న వారు ఉంటే విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

కొనసాగుతున్న సత్యసాయి కార్మికుల నిరసన

బత్తలపల్లి: ఉద్యోగ భద్రతతో పాటు పలు డిమాండ్ల సాధనకు సత్యసాయి కార్మికులు చేపట్టిన సమ్మె గురువారం 7వ రోజుకు చేరుకుంది. ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మికులు కోరారు. అధికారులు మొద్దు నిద్ర వీడి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఐఎఫ్‌టియు జిల్లా కోశాధికారి జగన్ మారుతి, మహబూబ్‌బాషా, షేక్ మహబూబ్‌బాషా, ఓబులేసు, శంకరయ్య, అనంతయ్య, మురుగేష్, రామ్మోహన, జయరాము, సద్గురు, నరసింహులు, కేశవ సిద్దయ్య, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని వినతి

ధర్మవరం రూరల్: సకాలంలో వర్షాలు కురవకపోవడంతో రైతులు వేరుశనగ సాగు చేసుకోలేకపోయారని రైతు సంఘం నాయకులు జంగాలపల్లి పెద్దన్న అన్నారు. రైతులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టాలని గురువారం ఎంపీడీఓ సౌజన్యకుమారి, వ్యవసాయాధికారి ముస్తఫాకు వినతిపత్రం అందజేశారు.

నోటీసు

కడప జిల్లా, ప్రొద్దుటూరు టౌన్ వాస్తవ్యుడైన మా కక్షిదారుడు **వి. రామాంజినేయరెడ్డి గారు** ప్రొద్దుటూరు **I A.D.M** గారి కోర్టులో (1) **C.C. No. 214/2023** మరియు 2) **C.C. No. 215/2023** చెక్ బౌన్స్ కేసులను మొత్తం రూ.4 కోట్ల రూపాయలకుగాను మరియు సదరు జిల్లా, కొండాపురం మండలం, తాళ్ళ ప్రొద్దుటూరు గ్రామంలో ఉండే మా కక్షిదారుడైన **వై.వి.శ్రీనివాసులరెడ్డి గారు** కూడా జమ్మలమడుగు మేజిస్ట్రేట్ గారి కోర్టులో **C.C. No. 347/2023** చెక్ బౌన్స్ కేసును 1 (ఒక) కోటి రూపాయలకు గాను సత్యసాయి జిల్లా, కొత్తచెరువు మండలం, చెన్న కేశవాపురం గ్రామ కాపురస్తులైన **1) డాక్టర్ ఉషారాణి సి.రెడ్డి మరియు 2)** చెన్నా సి. రెడ్డి అను వారిపైన మా కక్షిదారులు చెక్ బౌన్స్ కేసులు వేసినారు. అట్టి కేసులో ప్రొద్దుటూరు కోర్టులో **18.08.2023** తేదీన, జమ్మలమడుగు కోర్టులో **22.05.2023**వ తేదీన వాయిదాలు ఉండినవి. అయితే సదరు కేసులో మీరు హాజరుకాకపోవడం వలన ప్రొద్దుటూరు కోర్టులో కేసులు తిరిగి **01.12.2023** తేదీన, జమ్మలమడుగు కోర్టులో కేసు **30.09.2023** తేదీన తిరిగి వాయిదాలు ఉన్నవి అని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ప్రొద్దుటూరు, తేదీ: **01.09.2023**

ఇట్లు : **శ్రీ సి. సుదర్శన రెడ్డి,**
అడ్వకేట్, ప్రొద్దుటూరు.